# తాళంచెవులు

[కథానిక]

'మధుమూర్తి'

"చేతిగడియారాన్ని కొనిపెట్టవే అమ్మా" అని అమాయికంగా రఘు తల్లిని అడిగాడు. పుత్రుని కోరికను నెరవేర్చడం అంత తేలిక కాదు. ధనం మూలుగుతున్న ఆ ఇంట్లోనివారికి చేతిగడియారాలు కొనడం అంటే అంత కష్టమైన పనీ కాదు. ఏమిటీ వైరుధ్యం అంటే-దానికి జవాబు తాళంచెవుల గుత్తి ఇంకా ముసలాయన బొడ్డునే ఆశ్రయించుకొని ఉండడమే.

రఘుకు ఈ కోరిక కలిగినవెంటనే ముందుగా తననే అడిగాడని పార్వతమ్మకు తెలుసు. ఆ ఇంట్లో రఘుకు ఆమె తల్లి కావడమే అందుకు కారణం. పుత్రులు తమ కోరికలను ముందుగా మాతృహృదయానికి నివేదించడం సహజమే. ఈ సంగతి పార్వతమ్మకూ తెలుసు. కాని పట్టణం పోయి కొనవలసిన ఈ వస్తువును ముందుగా తననే రఘు ఎందుకు కోరాడో అని ఆమెకు బాధ కలిగింది. ఇంతకుముందు అప్పుడప్పుడు పల్లెలోని మంచివస్తువులు కావాలని కోరిక పుట్టడం, వాటిని తల్లిద్వారానే తీర్చుకోవడం అతనికి అలవాటయింది. అలవాటుప్రకారం అడిగాడని అనుకుంది. ఆ గడియారం తనద్వారా రాదని చెప్పి తండ్రిని అడగమందా మనుకుని ఆమె "నాన్నను అడగరా అబ్బాయి!"అని రఘుకు జవాబుచెప్పింది.

రఘుకు ఇది సరికొత్త పని. ఎన్నడూ ఇంతవరకూ చంద్రయ్యను కొడుకు ఏమీ కోరలేదు. కొడుకునకు కోరికలు ఉన్నాయని అతనికీ తెలుసు. ఐతే వాటిని నెరవేర్చే బాధ్యత ఇంకా తనమీదకు రానందుకు సంతోషిస్తూండేవాడు. చంద్రయ్యకూడా ఒక కొడుకుతండ్రి అయినప్పటికీ అత నింకా తండ్రిచాటు కొడుకుగానే ఉండిపోయాడు. ఇంకా తాళంచెవులు తనచేతికి అందకపోవడమే ఈ స్థితికి కారణం. ఇంట్లోకి చీపురుపుల్ల కావలసినా దానిని తెప్పించే భారం చంద్రయ్యకు కలగలేదు. ఇంకా ముసలి రాఘవయ్యే ఈ శ్రమను పడుతూంటాడు. రఘుకు ఈ సంగతులను అర్థంచేసుకునే వయస్సు లేకపోయినా తండ్రిని చేతిగడియారం కావాలనీ, కొనిపెట్టమనీ అడగడానికి జంకాడు. అలవాటు లేకపోవడమే ఈ భయానికి కారణం.

కాని చేతిగడియారం అతనికి కావాలి. అది అతని తీవ్రవాంఛ. అది నెరవేరాలంటే తల్లివల్ల జరిగే పని కాదని అనుకున్నాడు. "తాతనే అడిగితేనో?"అనుకున్నాడు రఘు. అనుకున్న మరుక్షణంలోనే అతనిలో ఆనందం ఉబికింది. తిన్నగా తాతగదిలోకి వెళ్ళాడు. "తాతా! చేతిగడియారం కొనిపెట్టవూ?" అన్నాడు. అత నెంత జాలిగా అడిగాడో చెప్ప తరంకాదు. కాని తాతకూ, జాలికీ చాలా క్రోసులదూరం. ఐతే తాతయ్య మరుక్షణంలోనే మనుమనికి జవాబు చెప్పలేదు.

రఘుప్రశ్న తాతకు అలవాటయిన ప్రశ్న కాదు. ఈ ప్రశ్నతో తాత చాలా తబ్బిబ్బయాడు. ఎన్నడూ తనను ఏదీ కోరలేదు. వీడికి పెద్దకోర్కెలు లేవుమేలేనని సంతోషిస్తూండేవాడు. చిన్న చిన్న కోరికలు ఏవి

కలిగినా అని తనవరకూ రాలేదు. తోపుడు బండి తల్లి చేయించింది. దానిని ఆమె తన పుట్టింటినుంచి తీసుకొని వచ్చింది. తన కేమీ ఖర్చు కాలేదు. యూనాం సిల్కు జుబ్బాలూ, జోళ్లూ కావాలంటే అవీ పార్వతమ్మ తన అన్నగారిద్వారా సంపాదించింది. ఈనాడు వీళ్ళందర్నీ వదలి, రఘు తనవద్దకు చేతిగడియారం కావాలంటూ రావడం ఏమిటా అని రాఘవయ్య ఆశ్చర్యపోయాడు. ఇదేదో కోడలు చూపిన కార్యక్రమం అనుకున్నాడు.

"మీ మామయ్యని అడగలేకపోయావా?" అని మనమణ్ణి ప్రశ్నిద్దామనుకున్నాడు కాని ఆ ప్రశ్నను మార్చి "మీ అమ్మను అడిగావా?" అన్నాడు.

"అడిగాను తాతయ్యా!" అన్నాడు రఘు.

"ఏమంది?"

"నిన్ను అడగమంది" అన్నాడు రఘు.

అబద్ధాన్నే పలికాడు రఘు. కాని ఆ అబద్ధం ఎంత ప్రమాదాన్ని కలిగిస్తుందో ఆ లేత మనస్సుకు తట్టింది కాదు. రాఘవయ్యకు మాత్రం ఈ సమాధానం నచ్చింది. కోడలి కార్యక్రమం అని తను ఊహించడం నిజమేనని ఈ అబద్ధం బలపరిచింది. దీనికి మరొక ఎత్తు ఎత్తాలని రాఘవయ్య మనమనితో "ఒరేయ్! నాన్న నడుగు" అన్నాడు.

తండ్రిని అడిగే అవసరం ఉండదు కదా అని సంతోషపడ్డ రఘుకు తాతజవాబు గాభరా పెట్టింది. ఎంతో ఆశతో, నాన్నను అడగక్కర్లేదు కదా అని చేసినపనికి ఇలాంటి ఫలితం కలిగినందుకు రఘు దిగులు చెందాడు. తాతసూచనవల్ల ఏమీ ధైర్యం కలగలేదు. మళ్ళీ అమ్మదగ్గిరికి పరుగెత్తాడు.

"ఏం రా! నాన్న నడిగావా?" అందామె.

"లేదమ్మా, తాత నడిగా"

"ఏమన్నారు?"

"నాన్న నడగమన్నాడు"

పార్వతమ్మా, రాఘవయ్యా ఒకే సలహాను సూచించారు కాని ఒక్కొక్కరి సలహా వెనుక భారతమంతటి అర్థాలున్నాయి. ఇవి రఘుకు తెలియవు. కాని పార్వతమ్మకు తెలుసు. కాని కుర్రవాడు తండ్రిని అడగడానికి భయపడి తాతను అడిగినందుకు మామగారి తత్వం కూడా బైటపడింది. అందుకు ఆమె సంతోషించింది. కాపరానికి వచ్చి పదిహేను సంవత్సరాలైనా కూడా పార్వతమ్మకు మామగారి తత్వం తెలియక పోలేదు. కాని, మనమడన్నా, మనమని కోరికలు తీర్చడమన్నా సరదాగాని, వాత్సల్యంగాని ఆయనలో లేవన్న సంగతి మాత్రం ఈ రోజునే తెలిసింది. అందుకే ఆమె ఆనందించింది. కాని ఎదురుగా బిక్క మొహంతో కూచున్న రఘుకు ఏం జవాబు చెప్పాలి? ఎంతగానో ఆమె ఆలోచించింది. ఆ ఆలోచనతో ఆమె మౌనంగా ఉన్నప్పుడు రఘు "మామయ్యను అడగనా? అమ్మమ్మను అడగనా? పిన్నిని అడగనా?" అని తనకు వీలైన మార్గాలన్నింటినీ వెల్లడిచేస్తూ ప్రశ్నించాడు. అన్నింటికీ కూడా ఆమె వద్దన్నట్లు తల ఆడించింది. అంతతో రఘుకు ఓర్పు తక్కువై "నాకీవేళ చేతి గడియారం తప్పకుండా కావాలి" అంటూ ఏడవడం ప్రారంభించాడు.

పదేళ్ళ కుర్రవానికి చేతిగడియారాన్ని ఉపయోగించడం తెలియకనేపోవచ్చు. కాని ఆ సరదా తీర్చడానికి శ్రమలేని గొప్పతనం ఈ ఇంటికి ఉండడం చేతనేపార్వతమ్మ తనకుమారుని అశక్తతనుమరోవిధంగా భావించలేక పోయింది. అదీగాక, పుత్రుని కోరికలు తీర్చడానికి ఎన్నాళ్లు తను పుట్టింటివారిని ఉపయోగించుకుంటుంది? రాఘవయ్యగారి లుబ్ధత్వం తనవారికి తెలుసుకాబట్టి, ఆడబడుచు ఎక్కడ ఇబ్బంది పడుతుందో అని తనవాళ్లు బాధపడతారని తెలుసు కనుక తన కోరికలు, పుత్రుని కోరికలు, భర్త కోరికలూకూడా నెరవేరుతున్నాయి. "మూలుగుతూన్న డబ్బును మామగారు కదపడు. ఇది ఎంతకాలం సాగగలదు?" అనే భావాలు ఆమెలో పుట్టి తిరిగి మరొకసారి కొడుకుతో "నాన్ననే అడుగు నాయనా! ఈ వేళే కాకినాడ వెళ్లి గడియారం కొనిపెడతారు" అని ఓదారుస్తూ చెప్పింది. రఘుకు గడియారం కోరికతోబాటు కాకినాడ చూడాలనే కోరికకూడా కలిగింది. పాతకోరిక కొత్తకోరికతో మరింత ప్రకాశవంతంగా కనిపించింది. ఆ ఉత్సాహమే తండ్రిని అడగడంలోని భయాన్ని వెనక్కి నెట్టింది. తిన్నగా రఘు తండ్రిగదిలోకి వెళ్లాడు.

"నాన్నా! నన్ను కాకినాడ తీసుకొని వెళ్ళి నాకో చేతిగడియారాన్ని కొనిపెట్టవూ?" అని ఘట్టిగానే అడిగాడు రఘు. కొడుకులో కోరికలు ఐదేళ్ళ నుంచీ కలుగుతున్నాయని చంద్రయ్యకు తెలుసు. కాని ఇంతవరకూ తనకు తెలియకుండానే వాని కోరికలు నెరవేరుతున్నాయి. అందువల్ల ఈ వేళ ఈ ప్రశ్న అతనికి చాలా గాభరా కలిగించింది. తన సందేహాలను ఇలా తీర్చుకున్నాడు.

"అమ్మనడుగు" అన్నాడు.

"అడిగాను"

కొంచెంసేపు ఆగి చంద్రయ్య "తాత నడుగు" అన్నాడు.

"అడిగాను" అన్నాడు రఘు.

చంద్రయ్యకు గాభరా ఎక్కువైంది. ఇదేదో తనమీదకు తండ్రీ, భార్యా పంపిన దండయాత్రలాగే ఉందనుకున్నాడు. తన కింక మార్గం ఏమిటి? "చేతిగడియారం ఇప్పుడప్పుడే నీకు ఎందుకురా? పెళ్ళినాటికి అలకమంచంమీద కోరుకుందువుగానిలే" అని సర్దిచెప్పడానికి చంద్రయ్యకు ధైర్యం చాలలేదు. రఘు అలవాటులేని పనులను రెండింటిని చేయడమే ఈ అధైర్యానికి కారణం. తననూ, తాతనూ రఘు అడగడం వింతే! అందులోనూ తొలిసారిగా కొడుకు తనను అడగడంచేత చంద్రయ్యలో పుత్రవాత్సల్యం కొత్తగా పుట్టుకొచ్చింది. రఘుచేతికి గడియారం పెడితే వాని చిరునవ్వులో తనకు ఆనందం ఉన్నట్లు చంద్రయ్య కొత్తగా ఊహించాడు. "పుత్రోత్సాహము తండ్రికి" అన్నదానిలోని అర్థాన్ని ఈవేళే చంద్రయ్య గ్రహించాడు.

"సరే నాయనా......కొంటాలే" అన్నాడు చంద్రయ్య.

"కాకినాడ నేనూ వస్తా నాన్నా"అన్నాడు రఘు.

"అలాగే".

రఘు ఇంక అక్కడ నిమిషమైనా నిలబడలేదు. చంద్రయ్యకుమాత్రం నిస్పృహ కలిగింది. చేతిగడియారం కొనిపెడితే, ఇంక మాటిమాటికీ వచ్చి ఇవి కావాలి, అవి కావాలి అని తనను పోరుపెడతాడేమో అనుకుని చంద్రయ్య భయపడ్డాడు. ఐనా ఈ చేతిగడియారం కొనాలంటే తనవద్ద డబ్బేదీ? నాన్న చిల్లిగవ్వ ఇవ్వడు. ఎక్కడో అప్పు తేవాలి. ఇప్పుడు అప్పులు ప్రారంభమైతే అవి అలా పెరిగిపోతూనే ఉంటాయేమో అని దిగులుచెందాడు. కాని పుత్రుని— తొలిసారిగా తనకు కలిగిన ఈ బిడ్డ—అందచందాలకు ఖర్చుపెట్టకపోతే వాడు కలిగినందుకు తనకు వేరే ఆనందం ఏదీ అనే మరో ఆశాభావం చంద్రయ్యలో జనించగానే పెదవిమీద చిరునగవు ఉదయించింది.

మరునాడు చంద్రయ్య రఘును వెంటబెట్టుకుని కాకినాడ వెళ్ళాడు. ప్రక్కింటి సీతారామయ్యదగ్గర నూరురూపాయలు చేబదులు తీసుకుని చంద్రయ్య పట్టణం వెళ్ళాడన్న సంగతి రాఘవయ్యకు తెలిసింది. ఆ క్షణంనుంచీ ముదివగ్గులో విప్లవం రేగింది. పట్టాలను తప్పించుకుని రైలు నడుస్తూంటే మరి ముసలిపట్టాలకు కోపం రాకుండా ఉంటుందా?

"వీడు అప్పులు చేయడం ప్రారంభించాడూ? ఇకనేం? నేను హరీ అనేటప్పటికి నా శ్రమంతా హారతికర్పూరం ఔతుంది" అనే విషాదం వెలిసే ఆగ్రహం రాఘవయ్యను ఆవహించింది.

సీతారామయ్యను పిలిచి "ఇంకెప్పుడూ మా వాడికి అప్పు లివ్వకోయ్"అని చెబుదా మనుకున్నాడు రాఘవయ్య. కాని పిలవక్కర్లేకుండానే సీతారామయ్యే ముసలాయనదగ్గరకు వస్తున్నాడు. సీతారామయ్యకూ తెలుసు—చంద్రయ్యకు ఇవ్వడం ప్రారంభించిన అప్పు కురుక్షేత్ర సంగ్రామాన్ని తీసుకొనివస్తుందని.

సీతారామయ్యకూడా రాఘవయ్యతో సమంగా తూగగల ఆస్తిపరుడే! గ్రామస్థులంతా ఈయనను దయకలవా డంటారు. అంటే కాస్త పరోపకారబుద్ధి ఈతనిలో ఉందని అర్థం.

సీతారామయ్యను చూడగానే రాఘవయ్య తనే సంభాషణ ప్రారంభించాడు. "మావాడికి అప్పులు తీసుకోవడం నేర్పుతున్నావా?"అని ప్రశ్నించాడు.

"నేను నేర్పేదేమిటి? అవసరం ఎంతవాడిచేతనైనా చేయి చాపిస్తుంది."

"మావాడి కేమీ అవసరం లేదే!"

"కుర్రవానికి చేతిగడియారం కొనిపెట్టడం అవసరం కాదూ?"

"బొడ్డూడని వెధవకు గడియారా లెందుకు చెప్పు"

"మరి ముద్దూ, మురిపెమూ అంటే ఏమిటి రాఘవయ్యా?"

"డబ్బు తగలెయ్యడం ముద్దా ఏమిటి?"

సీతారామయ్య అనుకున్నట్లే ముసలాయన ప్రశ్న బయటపడింది. ఇంక ఆగకుండా ఉపన్యాసం సాగించాడు.

"ఎవరి ముద్దుకోసం డబ్బు తగలెడుతున్నాడు? ఊళ్లోవాళ్ళ ముద్దుల్ని చెల్లించడానికి కాదు. తను కన్న కొడుకు ముద్దు చెల్లించడానికి. అతనుకాక మరెవ్వరు ఆ కుర్రవాని కోరికను తీరుస్తారు? ఆ కుర్రకుంక కూడా అసహజంగా ఏమీ కోరలేదు. ఇంత డబ్బు ఉన్నవాళ్ళే పిల్లల ముద్దుల్ని తీర్చకపోతే, ఆ మన సుబ్బయ్య తన కొడుక్కు ఇలాంటివి కొనిపెట్ట గలడా చెప్పు".

సుబ్బయ్యపేరు చెబితే రాఘవయ్యకు ఒళ్లు మండిపోతుంది. సంపాదన తక్కువైనా సుబ్బయ్య శ్రమపడి తెచ్చిన డబ్బు హాయిగా అనుభవిస్తాడు. రాఘవయ్య అరవై ఏళ్ళ కాలంలోనూ ఇలాంటి అనుభవాన్ని చూపకపోవడంవల్ల ఊళ్లోవాళ్ళంతా రాఘవయ్యలుబ్ధత్వంమాట వచ్చినప్పుడు సుబ్బయ్య ప్రస్తావన తెచ్చి అతన్ని పొగుడుతూవుండడం కొన్ని పుష్కరాలనుంచి జరుగుతోంది. ఈ అస్త్రం రాఘవయ్యకూ వినిపిస్తూంటుంది. ఇప్పుడు సీతారామయ్య తిరిగీ మరోసారి వినిపించాడు. అందుచేత మాట పెకల్లేదు. సీతారామయ్య తనఎదుటినుంచి వెళ్లిపోతే బాగుండు ననే చూపు అతని ముఖంలో కనిపిస్తోంది. కాని సీతారామయ్య అలా కదిలే ఘటం కాదు. తను వదులుదామనుకున్న అస్త్రాల్లో ఇంకొక్కటి మిగిలిపోయింది.

"నీలాగ మీ అబ్బాయికి లుబ్ధత్వం లే దనుకోకు రాఘవయ్యా. నీ లుబ్ధత్వం నీవాళ్లమీదే ప్రయోగింపబడుతూంది. మీవాడు ఓమెట్టు ముందుకు వచ్చాడు. తనవాళ్ళకూ తనకూ ఖర్చుపెడుతున్నాడు. కాని ఇతరులకు ఖర్చుపెట్టడంలో మీవాడు నీ కుమారుడే!"

"ఎందుకు సీతయ్యా! ఇంక నన్నేమీ అనకు. అప్పు లివ్వడం, పుచ్చుకోవడం ప్రారంభమైంది. దీన్ని పెరగనియ్యకుండా మొక్కగా ఉన్నప్పుడే వంచెయ్యాలి. దీనికి ఏదైనా మార్గం ఉందా అని ఆలోచిస్తున్నాను." అన్నాడు రాఘవయ్య.

"అప్పు అనే పదం ప్రస్తుతం మొక్కేగాని... మీవాడు...మహావృక్షమే అయాడుకదూ! ముప్ఫయ్యేళ్లవయస్సు వచ్చినవాడిని ఎలా వంచలేవో అప్పుల మాటనూ వచంలేవు. అదీగాక ఇన్నాళ్లూ చంద్రయ్య ఓపిగ్గా ఊరుకున్నాడు. ఇంక ఊరుకోకూడదనే ఉద్దేశం అతనికి కలిగింది. దానికి కారణంకూడా బాగానే ఉంది."

"చేతిగడియారం కొనవలసిరావడమేనా కారణం?" అన్నాడు రాఘవయ్య.

"నువ్వు మహా బ్రతికితే పదేళ్లు బ్రతుకుతావు. ఇలాంటి అవసరాలకే అతను డబ్బుకు వెతుక్కోవలసి వస్తుంది. పదేళ్ళలోనూ అతను మహాఅయితే పదివేలు అప్పు చేస్తాడే అనుకో. నువ్వు ఆనాటికి పోగుచేసే దానిలో అయిదోవంతు ఉండదు. ఔనంటావా? ఇదే మీవాడి ఉద్దేశ్యం" అన్నాడు సీతారామయ్య.

"ఇక్కణ్ణుంచి వెళ్లిపో బాబూ!" అని అఃగలిగాడు రాఘవయ్య. సీతారామయ్యకు ఇంక ఉండవలసిన అవసరమూ తీరింది మహాఅస్త్రాన్ని వదిలి తుండుగుడ్డ బుజాన్ని తగిలించుకొని సీతారామయ్య నిష్క్రమించాడు.

రాఘవయ్యకు ఒళ్ళు తెలియని విచారంవచ్చింది. రాత్రల్లా బాధపడ్డాడు. మరునాడు జ్వరం వచ్చింది. చంద్రయ్యా, కొడుకూ తిరిగివచ్చేటప్పటికి రాఘవయ్య మంచంమీదే ఉన్నాడు. చంద్రయ్యకు ఈ అవస్థకు కారణం తెలిసివచ్చింది. ఐతే ముసలాయనలో మార్పు వస్తుం దనుకున్నాడు కాని తాళంచెవు లింకా పండంటి శరీరాన్నే అంటిపెట్టుకొనిఉన్నాయి. గుప్పిట్లోనే వాటిని గట్టిగా పట్టుకుని రాఘవయ్య పదిరోజులు గడిపాక ప్రాణాలను వదిలాడు. పాపం! అంతగా ప్రేమింపబడినందుకైనా తాళంచెవులు తనివెంట నడవలేకపోయాయి. చంద్రయ్యచేతిలో పడిపోయాయి. తాళంచెవుల గుత్తిని గట్టిగా చప్పుడుచేస్తే తాతయ్య ఓసారి పరకాయించి చూస్తాడనే నమ్మకం ఆఇంట్లో వారందరికీ ఉంది. అందుకే ఆ ఇంట్లో తాళంచెవులు నాట్యంచేయడం లేదు. వాటిని చంద్రయ్య భద్రంగా దాచిపెట్టిన భోషాణానికి ఉన్న తాళంచెవిమాత్రం శరీరాన్ని అంటిపెట్టుకొనే ఉంటుంది.